క్లుప్తంగా

సీపీఐలో చేరిక


జయ్‌పాల్‌రెడ్డికి కండువా వేస్తున్న చాడ వెంకట్‌రెడ్డి

చిగురుమామిడి: ఓగులాపూర్ మాజీ సర్పంచ్ కోమటిరెడ్డి జయ్‌పాల్‌రెడ్డి ఎట్టకేలకు సీపీఐ తీర్థం పుచ్చుకున్నారు. ఆదివారం ఓగులాపూర్‌లో సీపీఐ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా గ్రామానికి వచ్చిన జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి సమక్షంలో చేరారు. గతంలో సీపీఐ నుంచి సర్పంచ్‌గా గెలిచినా.. గ్రామాభివృద్ధికి బీఆర్‌ఎస్‌లో చేరారు.

గౌడ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్


సభ్యులతో గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్

శంకరపట్నం: కరీంపేట గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడిగా గుర్రం శ్రీనివాస్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం గౌడ సంఘం సమావేశంలో సభ్యులు పాల్గొని ఎన్నుకున్నారు. తిరుపతి, ప్రభాకర్, ఆంజనేయులు, కొంరయ్య, శ్రీనివాస్, వీరస్వామి, వీరమల్లు, రవి, సాగర్, పవన్, చందు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మాదిగలను మంత్రి వర్గంలోకి తీసుకోవాలి

శంకరపట్నం: మాదిగలను మంత్రి వర్గంలోకి తీసుకోవాలని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సముద్రాల సంపత్ కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి 9 మాసాలు గడిచినా జనాభా నిష్పత్తి ప్రకారం మాదిగలకు మంత్రి పదవులు రాలేదన్నారు.

వర్షపు నీటితో ఇబ్బందులు


రేకొండ కాలువ వద్ద మొక్కలు తొలగిస్తున్న కూలీలు

చిగురుమామిడి: రేకొండ గ్రామంలో ఊరచెరువు కట్టకాలువ వద్ద వర్షపు నీరు సరిగా పోక రోడ్డుపై ప్రవహించి రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. రోజూ ఒకరు లేదా ఇద్దరు ఆ నీటిలో జారి పడి గాయపడుతున్నారు. ఈ సమస్య పది సంవత్సరాలుగా ఉంది. శాశ్వత పరిష్కారం చేయాలని రేకొండ గ్రామస్తులు, రైతులు, ఇతర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సంపత్, కోఆర్డినేటర్ అనిత తదితరులు

తిమ్మాపూర్: మండలస్థాయి ఎస్జీఎఫ్ పోటీల్లో మానకొండూర్ బాలుర మైనారిటీ గురుకుల విద్యార్థులు సత్తా చాటారని ప్రిన్సిపాల్ పిడిశెట్టి సంపత్ తెలిపారు. ఖోఖో అండర్ 14, 17 విభాగాల్లో ప్రథమ, కబడ్డీ అండర్ 14లో ద్వితీయ, 100 మీటర్ల రన్నింగ్ అండర్–17లో ద్వితీయ, 200 మీటర్ల రన్నింగ్ అండర్–17లో ద్వితీయ, అండర్ 14లో ద్వితీయ పతకాలు సాధించినట్లు వివరించారు. విద్యార్థులను పాఠశాలలో అభినందించారు. కళాశాల, పాఠశాల కోఆర్డినేటర్లు కిన్నెర అనిత, ఎ.రత్నాకర్, వ్యాయామ ఉపాధ్యాయుడు మొయినుద్దీన్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

కరీంనగర్: అంబేడ్కర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో విద్యాధరి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్.ప్రతీక్, పి.అశ్వితకుమార్‌లు ప్రతిభకనబర్చి మొదటి, మూడో స్థానం పొందారు. చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ వసంత్‌కుమార్ అభినందించి మెడల్స్ బహూకరించారు. పాఠశాల చైర్మన్ జె.వెంకటేశ్వరరావు, కరస్పాండెంట్ హరిచరణ్‌రావు, మేనేజింగ్ డైరెక్టర్ మౌనికలు అభినందించారు.

'గాలిపెల్లి'కి పురస్కారం

కరీంనగర్ టౌన్: కరీంనగర్‌కు చెందిన గాలిపెల్లి కుమార్‌కు అరుదైన గౌరవం దక్కింది. బెంగుళూర్‌కు చెందిన సోమల రాజు స్వచ్ఛంద సేవా సంస్థ 12వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం కుమార్‌కు మదర్ థెరిస్సా జాతీయ సేవా పురస్కారం అవార్డు అందించి ప్రశంసాపత్రంతో సన్మానించింది.

గజానన.. గౌరి తనయ..


చొప్పదండి: సాయిబాబా ఆలయంలో సహస్ర దీపాలంకరణ


తిమ్మాపూర్‌లోని శ్రీహోమ్స్‌కాలనీలో అన్నదానం


శంకరపట్నం: కేశవపట్నంలో నైవేద్యం సమర్పించిన మహిళలు

తొమ్మిది రోజులుగా గణనాథుడు భక్తుల పూజలందుకుంటున్నాడు. ఏ ఊరు చూసినా సందడి వాతావరణం కనిపిస్తోంది. ఆదివారం కావడంతో చిన్నారులు కేరింతలు కొడుతూ మండపాల వద్ద సందడి చేశారు. హుజూరాబాద్, మానకొండూర్, చొప్పదండి నియోజకవర్గాల్లో మండపాల వద్ద అన్నదానాలు, కుంకుమార్చన, దీపారాధన, పూజలు చేశారు. మహా నైవేద్యాలు సమర్పించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


హుజూరాబాద్‌రూరల్: కాట్రపల్లిలో కుంకుమ పూజ చేస్తున్న మహిళలు


జమ్మికుంట: మోత్కులగూడెంలో 141 నైవేద్యాలు సమర్పించిన భక్తులు


మానకొండూర్: అన్నారంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో దీపాలంకరణ చేస్తున్న మహిళలు


ఇల్లందకుంట: బూజునూరులో అన్నదానం చేస్తున్న మాజీ ఎంపీపీ పావని-వెంకటేశ్ దంపతులు


గంగాధర: కొండన్నపల్లిలో అన్నదానం చేస్తున్న చిన్నారులు


గన్నేరువరంలో గణపయ్యకు 108 రకాల నైవేద్యాలు

వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లు పరిశీలిస్తున్న చైర్మన్ రాజేశ్వర్‌రావు, సీఐ రవి తదితరులు


డీజే సౌండ్‌బాక్స్ యజమానులకు సూచనలు చేస్తున్న ఎస్సై రవి

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నాయిని చెరువు వద్ద సోమవారం నిర్వహించే నిమజ్జనం ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపెల్లి రాజేశ్వర్‌రావు, టౌన్ సీఐ వరంగంటి రవి, పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్ ఆదివారం పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ఏర్పాట్లలో లోపం లేకుండా చేశామన్నారు. వరుస పద్ధతిలో గణనాథులను తీసుకురావాలని కోరారు. కౌన్సిలర్ పొనగంటి రాము, దిలీప్, నాయకులు పాల్గొన్నారు.

వినాయక శోభాయాత్రలో డీజే వద్దు

శంకరపట్నం: వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా డీజే పెడితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై రవి డీజే సౌండ్‌బాక్స్ యజమానులను హెచ్చరించారు. కేశవపట్నం పోలీస్ స్టేషన్‌లో ఆదివారం వారితో సమావేశం నిర్వహించారు. శోభాయాత్రను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

రాత్రి 9 గంటల్లోపే నిమజ్జనం చేయాలి

వీణవంక: రాత్రి 9 గంటల్లోపే వినాయకుడి నిమజ్జనం చేసేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకోవాలని జమ్మికుంట రూరల్ సీఐ కిశోర్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో మండప, డీజే నిర్వాహకులతో సమావేశం నిర్వహిచారు. ఎస్సై తోట తిరుపతి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


హుజూరాబాద్ రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో ప్రమాదకరమైన మలుపు ఉంది. వాహనదారులు ఈ మలుపు వద్ద అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ఈ సమస్యపై ప్రశ్నించాల్సిన అధికారి
భూపతిరెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈఈ, సెల్ నం.: 9440818421

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9848408781, 8790144227, 9553955664

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాలి


చెల్పూర్‌లో సభ్యత్వ నమోదు చేయిస్తున్న గంగాడి కృష్ణారెడ్డి


బొమ్మనపల్లిలో మాట్లాడుతున్న రాంగోపాల్‌రెడ్డి

హుజూరాబాద్‌రూరల్: కేంద్ర ప్రభుత్వ పథకాలపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేసి రికార్డు స్థాయిలో సభ్యత్వ నమోదు చేయించాలని జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. చెల్పూర్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మండలాధ్యక్షుడు రాముల కుమార్, మండల కన్వీనర్ ముప్పు మహేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి బింగి కరుణాకర్, నరసింహరాజు, అసెంబ్లీ కన్వీనర్ మాడ గౌతమ్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి జిల్ల సుధాకర్, శ్రీరామ్ శ్యామ్ తదితరులున్నారు.

ఇల్లందకుంట: భారతీయ జనతా పార్టీలో చేరడానికి యువత ముందుండాలని, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడంలో ముందున్న బీజేపీకి యువత మద్దతు పలకాలని జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి కోరారు. ఆదివారం లక్ష్మాజిపల్లి గ్రామంలో మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మండల సభ్యత్వ కోఆర్డినేటర్లు మట్ట పవన్‌రెడ్డి, గుత్తికొండ రాంబాబు, మాడ వెంకట్‌రెడ్డి, నరసింహరాజు, సమ్మిరెడ్డి, మాడ గౌతమ్ రెడ్డి, సుధాకర్, కంకణాల సురేందర్‌రెడ్డి, అంతం ఎల్లారెడ్డి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీణవంక: దేశ సంక్షేమం, అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, అందుకే దేశ ప్రజలు బీజేపీ వైపే ఉన్నారని జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. గంగారం గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. మండల అధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి, మాడ వెంకట్‌రెడ్డి, ఎర్రబెల్లి సంపత్‌రావు, గొట్టిముక్కుల సంపత్‌రావు, బొంగోని సదానందం, గొడుగు వినోద్, సుధాకర్, మోరే స్వామి, రాజారాం తదితరులున్నారు.

జమ్మికుంట: బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని దుర్గా కాలనీ 166వ బూత్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సందర్శించారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ గౌతమ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి బింగి కర్ణాకర్, నరసింహరాజు, శీలం శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ శ్రీరాంశ్యామ్, పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేశ్, రాజేందర్, బూత్ అధ్యక్షుడు ఉడుగుల మహేందర్, మోతే స్వామి, వేముల జగన్, పల్లపు రవి, ఇటుకాల స్వరూప, మోడెం రాజు, రాజేశ్ తదతరులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని 17 గ్రామాల్లో ప్రతి ఇంటా బీజేపీ సభ్యత్వం తీసుకోవాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి కోరారు. ఆదివారం బొమ్మనపల్లి గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మండల అధ్యక్షుడు పైడిపెల్లి శ్రీనివాస్, సభ్యత్వ కన్వీనర్ అచ్చ రవీందర్, కోకన్వీనర్ కంది శంకర్, నిమ్మ రమాకాంత్‌రెడ్డి, ఆరెల్ల శ్రీనివాస్, మామిడి రమేశ్, మాచమల్ల బుజన్న పాల్గొన్నారు.

ఎవరో వస్తారని చూడకుండా..


గండి పూడ్చుతున్న రైతులు

ఇల్లందకుంట: మండల పరిధిలోని వాగొడ్డు రామన్నపల్లి, మల్యాల, లక్ష్మాజిపల్లి గ్రామాల రైతన్నల ఆయకట్టు పారే వెంకటేశ్వర నాలా భారీ వర్షానికి గండి పడింది. దీంతో పంట పొలాలు ఎండిపోతున్నాయి. మరమ్మతునకు అధికారులకు తెలియజేస్తే.. నిధుల్లేవని, మీరే చేసుకోండని తెలిపారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లినా ఎటువంటి ఫలితం లేదని భావించిన మూడు గ్రామాల సుమారు 50 మంది రైతులు సొంత ఖర్చులతో తాత్కాలికంగా గండి పూడ్చడానికి పూనుకున్నారు. అధికారులు, పాలకులు స్పందించి శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

'ముత్యం సార్ యాదిలో' సంస్మరణ సభ

కరీంనగర్‌సిటీ: శాతవాహన యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాల్‌లో ఆదివారం తెలుగు విభాగం ప్రస్తుత, పూర్వ విద్యార్థులు సంయుక్తంగా ముత్యం సార్ యాదిలో సంస్మరణ సభ నిర్వహించారు. మాజీ రిజిస్టర్ ఆచార్య వినాయక రెడ్డి మాట్లాడుతూ మంచి అధ్యాపకులకు ఎప్పుడూ విద్యార్థులకు ఏదో అందించాలనే తపన ఉంటుందని అన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత నలిమెల భాస్కర్, మాజీ మేయర్ రవీందర్ సింగ్, ఉప రిజిస్ట్రార్ వై. కిషోర్, జాతీయ సేవా పతకం సమన్వయకర్త మనోహర్, అన్నవరం దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవో నేత జన్మదిన వేడుకలు

కరీంనగర్ అర్బన్: టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలను ఉద్యోగ సంఘాల నేతలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం టీఎన్జీవో భవన్‌లో వేద బ్రాహ్మణుల ఆశీర్వచనాలతో బ్యాండ్ భాజాలతో జరిపారు. కార్యక్రమంలో టీఎన్జీవోల సంఘం జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి, కేంద్ర సంఘం నేతలు నాగుల నరసింహస్వామి, రాగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు


గాయపడ్డ ఉమాపతిరెడ్డి

గన్నేరువరం: గుండ్లపల్లి స్టేజీ రాజీవ్ రహదారిపై ఆదివారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల కథనం ప్రకారం.. హుజూరాబాద్ మండలం రాంపూర్‌కు చెందిన ఉమాపతిరెడ్డి, సుభాష్‌రెడ్డి సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం వీరాపూర్ గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చారు. తిరిగి పని నిమిత్తం గుండ్లపల్లి స్టేజీకి వచ్చి మళ్లీ వీరాపూర్ వెళ్తున్నారు. ఈ క్రమంలో చిగురుమామిడి మండలం రేకొండ గ్రామానికి చెందిన యువకులు కారులో సిద్దిపేట వైపు వెళ్తూ ద్విచక్ర వాహనాన్ని వెనకనుంచి ఢీకొట్టారు. ఉమాపతిరెడ్డి పాదంపై, సుభాష్‌రెడ్డి చేతితోపాటు ముఖాలపై తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఫోర్‌లైన్ అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు.

ఆటో యూనియన్ కార్యవర్గం

కరీంనగర్‌రూరల్: ఆటో కార్మిక సంక్షేమ సంఘం కరీంనగర్‌రూరల్ మండల కార్యవర్గాన్ని ఆదివారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కందుల సంపత్, ప్రధాన కార్యదర్శిగా కొత్తకొండ సుభాష్, ఉపాధ్యక్షులుగా అవారి రమేశ్, కారంగుల సందీప్, సహాయ కార్యదర్శులుగా రాచమల్ల తిరుపతి, మూల శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా బుచ్చాల కొమురయ్య, కోశాధికారిగా బుర్ర సంజీవ్, కార్యవర్గసభ్యులుగా దాడి సంపత్, చిట్యాలి సతీశ్, అనుముల శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

అభినందనీయం

విద్యానగర్(కరీంనగర్): హైదరాబాద్‌లోని కోఠి ఉమెన్స్ కాలేజీకి చాకలి ఐలమ్మ ఉమెన్స్ యూనివర్సిటీ అని పేరు పెట్టడం అభినందనీయమని తెలంగాణ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మీసాల మల్లిక్ ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

వేములవాడ సమాచారం


వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సాయంత్రం 5 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	01	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	19	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	01	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	0	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	06	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	10	560
నందీశ్వర సూట్స్	02	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	11	448
పార్వతీపురం స్పెషల్	03	672
పార్వతీపురం సాధారణ	0	336

– వేములవాడ

విద్యుత్ మోటారు తొలగించాలి

కరీంనగర్‌రూరల్: చామనపల్లిలోని మన్నెకుంటలో ఓ రైతు అక్రమంగా విద్యుత్ మోటారును ఏర్పాటు చేసుకుని నీటిని వినియోగించుకుంటున్నాడు. సమీపంలోని ఈతచెట్టుకు విద్యుత్ మీటరు అమర్చి కుంట నీటిని అక్రమంగా వ్యవసాయానికి వాడుకుంటున్నాడు. అధికారుల అండతో దర్జాగా ఏర్పాటు చేసుకున్నాడని, విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి మోటారు తొలగించేలా చర్యలు చేపట్టాలని రైతు మాధవరావు ఆరోపించారు.